నిరుపేదకు వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 42వ వార్డుకి చెందిన కొండవలస మురళీమోహన్‌కు రూ. 10 వేలు ఆర్థికసాయం అందించారు. ఆర్థికంగా తాను పడుతున్న బాధలను వాసుపల్లి వద్ద మొరపెట్టుకున్న మురళీమోహన్‌కు చేయూతగా ఆయన ఈ సాయం చేశారు. 104 ఏరియాలో తన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసుపల్లి తిరుపతి ఘటన గురించి మాట్లాడుతూ స్వామి దర్శనానికి వెళ్లి భక్తులు తొక్కిసలాటలో చనిపోవడం చరిత్రలో జరగలేదన్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి అన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి పూజలు

డాబాగార్డెన్స్: ముక్కోటి ఏకాదశి పూజలు శుక్రవారం వైభవంగా జరిగాయి. జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి (వైకుంఠ) ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి ఉత్తరద్వార దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శనాన్ని భక్తులు దర్శించుకున్నారు. జీవీఎంసీ 31వ వార్డు పరిధి గొల్లలపాలెం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఉమారామలింగేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో రాజగోపాలరెడ్డి పర్యవేక్షించారు.



ఉత్తరద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామి

అల్లిపురం: బల్లిగిరి వెంకన్న వజ్ర కవచధారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో స్వామిని విశేషంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఆలయ కల్యాణ మండపంలో శేషపాన్పుపై భక్తులకు దర్శనమిచ్చాయి. ఈవో జీవీ రమాబాయి తదితరులు పాల్గొన్నారు. అలివేలు మంగమ్మ ఆలయంలో అలివేలు మంగమ్మ, పద్మావతితో పాటు గోదాదేవిని విశేషంగా అలంకరించి ఆలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

స్వామివారికి ప్రత్యేక పూజలు..

మహారాణిపేట: ఇసుక కొండ శ్రీ రమా సత్యనారాయణ స్వామివారిని బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులు గేదెల శ్రీహరి, గౌరీరెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారులకు లైఫ్ జాకెట్ల పంపిణీ

మహారాణిపేట: సముద్రాన్ని కాపాడండి, మీ జీవితాన్ని కాపాడుకోండి అని జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం కెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హార్బర్‌లో మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు లైఫ్ జాకెట్ వినియోగం వల్ల వేట సమయంలో మత్స్యకారులు సురక్షితంగా ఉంటారని అన్నారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆషాజ్యోతి, సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, కెన్ ఫౌండేషన్‌కు చెందిన రంజిత్ కుమార్, కె.అనంత్, పి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 19 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రతి శుక్రవారం నిర్వహించే టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి 19 వినతులు అందాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుంచి అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్న దృష్ట్యా ప్రతి సోమవారం ప్రజా పరిష్కార వేదికతో పాటు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహిస్తామన్నారు. అందిన ఫిర్యాదుల్లో జోన్–2కు 4, జోన్–3కు 6, జోన్–4కు 2, జోన్–5కు ఒకటి, జోన్–6కు 3, జోన్–8కు 3 వినతులు అందాయి.

'మీ చేతగానితనాన్ని ఇతరులపై నెట్టేస్తారా?'

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రంలో ఏం జరిగినా.. గత ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అనడం వారి చేతగానితనానికి నిదర్శనమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా పాలన మీద గానీ, వ్యవస్థల మీద గానీ పట్టు సంపాదించలేకపోయారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ తప్పిదం జరిగినా గత ప్రభుత్వం మీదకు నెట్టేస్తూ కాలక్షేపం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని, ఇది కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జరిగిందని ఆమె ఆరోపించారు. ఈ ప్రమాదంలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. 2,500 మందికే కనీస ఏర్పాట్లు చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసి.. భక్తుల పట్ల తీవ్రనిర్లక్ష్యం చూపిందని మండిపడ్డారు. వైకుంఠ ఏకాదశికి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వస్తారన్న విషయం ప్రభుత్వానికి తెలిసినా.. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిందో సీఎం, డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. 'మా ప్రాణాలు పోతున్నాయి. అంబులెన్స్ సదుపాయం కల్పించండి' అని తొక్కిసలాటకు గురైన భక్తులు ప్రాధేయపడినా అధికారులు స్పందించలేదన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

48 గంటల జనన ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రం ప్రారంభం

మహారాణిపేట: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు వన్‌టౌన్‌లోని గవర్నమెంట్ విక్టోరియా ఆస్పత్రిలో దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో తప్పులు సరిచేసి నూతన జనన ధ్రువీకరణ పత్రాలు జారీ కేంద్రం ప్రారంభిస్తుండటం హర్షణీయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం కేంద్రాన్ని ఆయనతో పాటు విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉప్పాడ జీవన్ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎం.వి.రమణ కుమారి, జి.శ్రీలత, ఆస్పత్రి హెడ్ నర్స్ జి.చంద్రకళ, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పిల్లల జనన ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సీతారాం

ప్లాస్టిక్ వినియోగంతో మత్స్య సంపదకు ముప్పు

మహారాణిపేట: తీర ప్రాంత ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు, ఫిషింగ్ హార్బర్, ఫిష్ మార్కెట్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించినట్టు జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం హార్బర్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై మత్స్యకారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రసంగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలిస్తే మత్స్య సంపద తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆషాజ్యోతి, సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, ఇతర నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

తాబేళ్ల రక్షణపై అవగాహన

మహారాణిపేట: తాబేళ్ల సంరక్షణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఫిషింగ్ హార్బర్‌లో నెట్ ఫిష్ ఆధ్వర్యంలో మత్స్యకారులతో అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో తీర ప్రాంతానికి గుడ్లు పెట్టడానికి వచ్చి తాబేళ్లు మృతి చెందుతున్నాయన్నారు. ప్రతి బోటు, మరపడవల యాజమానులు వేటాడే బోట్లకు తప్పని సరిగా టెడ్ పరికరాన్ని వాడాలన్నారు. ఆలివ్‌రిడ్లే జాతికి చెందిన తాబేళ్లు తీర ప్రాంతానికి గుడ్లు పెట్టడానికి ప్రతి ఏడాది నవంబర్–ఫిబ్రవరి నెలల మధ్య కాలంలో వస్తాయని, చేపలు వేటాడే వలల్లో చిక్కుకొని ప్లాస్టిక్, సముద్ర కాలుష్యం కారణంగా మృతి చెందుతున్నాయన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని మత్స్యశాఖ, ఏంపెడ, అటవీ శాఖ, మెరైన్ పోలీసులు ఆధ్వర్యంలో హార్బర్ తీర ప్రాంతాల్లో అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆశాజ్యోతి, నెట్ ఫిట్ కో ఆర్డినేటర్ హనుమంతరావు, ఏపీ కోస్టల్ మర బోట్లు సంఘం అధ్యక్షుడు బి.కొండబాబు, ఇతర నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి విరాళం

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి నిత్యాన్నదాన పథకానికి సింహాచలం ప్రాంతానికి చెందిన కశిరెడ్డి కాశీ విశ్వనాథం కుటుంబ సభ్యులు రూ.లక్షా ఒక వెయ్యి 116 విరాళం అందజేశారు. ఆలయ ఈవో కె. శోభారాణికి చెక్కు రూపంలో విరాళాన్ని అందజేశారు. వీరికి అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం అందజేశారు.



ఆలయ ఈవోకు చెక్కు అందజేస్తున్న దాతలు

క్రికెట్ టోర్నమెంట్‌కు ఇద్దరు వైద్య విద్యార్థుల ఎంపిక

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన సతీష్, దివ్యాన్షు ప్రకాష్ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ (పురుషులు) టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఈనెల 16 నుంచి 21 వరకు చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు విద్యార్థులను అభినందించి ఎంపిక పత్రాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆర్. సునీల్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్. పట్రుడు తదితరులు పాల్గొన్నారు.




వైద్య విద్యార్థులకు ఎంపిక పత్రాలు అందజేస్తున్న డాక్టర్ బుచ్చిరాజు

ప్రపంచ యాత్రకు సిద్ధమైన సాహసికుడు భరద్వాజ్

డాబాగార్డెన్స్: మహా విశాఖ నగరానికి చెందిన సాహసికుడు భరద్వాజ్ దయాల మరోసారి ప్రపంచ యాత్రకు సిద్ధమయ్యారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ నుంచి ప్రపంచ యాత్రకు బయలుదేరనున్నారు. 2004లో మోటార్ సైకిల్‌పై భారతదేశమంతటా యాత్ర చేసిన భరద్వాజ్ 2006లో ప్రపంచ యాత్ర చేశారు. 5 ఖండాలు, 16 దేశాల మీదుగా 47 వేల కిలోమీటర్లు ప్రయాణం చేశారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో తన పర్యటన వివరాలు వెల్లడించారు. ఒక్కో దేశంలో అక్కడి మహిళలను కలుసుకుని వారి స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు తెలుసుకుంటానన్నారు. సమావేశంలో సీనియర్ పాత్రికేయుడు ఎస్. నాగేశ్వరరావు, పర్యావరణవేత్త సోహన్ అట్టంగడి, సాహస మహిళ వైశాలి, జేసీఏ మహిళా విభాగం అధ్యక్షురాలు కలిక పాల్గొన్నారు.



యాత్ర వివరాలు వెల్లడిస్తున్న భరద్వాజ్





వ్యాపార, వాణిజ్య, వైద్య కేంద్రాల సమాహారం దక్షిణం

డాబాగార్డెన్స్: ఒకనాటి బెస్త గ్రామం.. మున్సిపాలిటీ అయింది. మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారింది. కార్పొరేషన్ కాస్త గ్రేటర్‌గా అవతరించింది. వర్తకం అభివృద్ధి చెందడం, పోర్టు, షిప్‌యార్డ్‌ల ఆవిర్భావం వంటివి మరింత అభివృద్ధికి సోపానాలయ్యాయి.

పేరు ఎలా వచ్చిందంటే..

విశాఖపట్నానికి ఈ పేరు రావడం వెనుక భిన్న కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ద్రాక్షారామం భీమేశ్వరాలయంలో లభ్యమైన క్రీ.శ.1068 నాటి శిలాశాసనంలోనే విశాఖపట్నం అనే పేరు ఉన్నట్టు తెలుస్తోంది. వైశాఖేశ్వరుని ఆలయం చుట్టూ నగరం విస్తరించినందు వల్లే విశాఖపట్నంగా పేరు వచ్చిందనేది ఒక కథనం. ఇషాక్ మదీనా అనే దర్గా పేరు మీదుగా విశాఖపట్నం పేరు స్థిరపడిందని మరో కథనం. 1962లో టౌన్ ప్లానింగ్ ట్రస్ట్, 1979లో విశాఖ నగరాభివృద్ధి సంస్థ (ఉడా) ఏర్పాటు కావడంతో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతూ వచ్చాయి. 1923లో కేజీహెచ్, 1930లో యూనివర్శిటీ, విమానాశ్రయం, 1941లో షిప్‌యార్డ్, 1942లో నౌకాదళం వంటివి వచ్చాక నగరం ఎల్లలు విస్తరిస్తూ వచ్చాయి. 1979లో విశాఖనగర పాలక సంస్థ ఆవిర్భవించడం, నగరాభివృద్ధిని కీలకమైన మలుపు తిప్పింది. ఆదిలో రెండేళ్ల పాటు స్పెషలాఫీసర్ పాలన కొనసాగినా 1981 నుంచి పాలకవర్గం ఎన్నికవుతూ వస్తోంది. కార్పొరేషన్ స్థాయికి ఎదగడం, నిధుల లభ్యత పెరగడం వంటి కారణాల వల్ల నగరాభివృద్ధి ఊపందుకుంది. రోడ్లు, డ్రైయిన్లు, వీధి దీపాలు, తాగునీరు వంటి కనీస సదుపాయాలే కాకుండా నగరానికి ఉండాల్సిన అన్ని హంగులూ కార్పొరేషన్ దశల వారీగా కల్పించగలిగింది. 2005లో మహా విశాఖ నగర పాలక సంస్థగా ఆవిర్భవించింది.

హాస్పిటల్స్‌కి చిరునామా..


ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా ఉన్న కింగ్ జార్జ్ ఆస్పత్రి (కేజీహెచ్), ప్రభుత్వ విక్టోరియా (ఘోసాసుపత్రి) ఆస్పత్రితో పాటు ఆంధ్రా హాస్పటల్, సూర్యా, ఇండస్, మెడికవర్, సింహాద్రి తదితర ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు పలు డయాగ్నొస్టిక్ సెంటర్లకు చిరునామాగా ఉంది. అలాగే పలు సర్జికల్ సెంటర్లు కూడా ఈ ప్రాంతంలో అందుబాటులో ఉన్నాయి.

పురాతన కట్టడాలు.. చర్చిలు..


200 ఏళ్లకు పైబడిన చర్చిలు, మసీదులు, హిందూ ముస్లిం.. క్రిస్టియన్‌కు సంబంధించి వేంకటేశ్వరస్వామి ఆలయం, కొండగుడి మేరీమాత, దర్గా ఇక్కడే ఉన్నాయి. రీడింగ్ రూమ్ వద్ద 200 ఏళ్ల నాటి చర్చి, ఉత్తరాంధ్ర కల్పవల్లి, ఆంధ్రుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారు, దుర్గాలమ్మ ఆలయాలతో పాటు అనేక దేవాలయాలు, చర్చిలు, పురాతన మసీదులు, పురాతన బరియల్ గ్రౌండ్స్ ఇక్కడే ఉన్నాయి.



విద్యుత్ కాంతుల్లో జగదాంబ నుంచి లేపాక్షి జంక్షన్



నాటి బెస్త గ్రామం.. ఓడరేవు ప్రాంతం




నేడు మహానగరం.. స్మార్ట్‌సిటీ

వస్త్ర దుకాణాలకు కేరాఫ్ జగదాంబ జంక్షన్..

వస్త్ర దుకాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా జగదాంబ జంక్షన్ నిలిచింది. మహిళలు, పురుషులు, కిడ్స్ దుస్తులతో పాటు ఫుట్‌వేర్, షాపింగ్ మాల్స్‌కు కేంద్ర బిందువుగా జగదాంబ జంక్షన్ నిలిచింది. చందన బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్ మాల్, కంచి కామాక్షి, బొమ్మన బ్రదర్స్, తుమ్మిడి బ్రదర్స్, ఎస్ఆర్ షాపింగ్ మాల్, లక్కీ షాపింగ్ మాల్, కేఎల్ఎం, కంకటాల, ఇటీవలే డాబాగార్డెన్స్‌లో చెన్నై షాపింగ్ మాల్, జగదాంబ (లేపాక్షి) జంక్షన్ వద్ద ఆర్ఎస్ బ్రదర్స్ షోరూం వంటి వాటిని ఆవిష్కరించారు.



కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం



ప్రసిద్ధిగాంచిన ఏవీఎన్ కాలేజీ

సెల్‌ఫోన్ల కేంద్రంగా..

సెల్‌ఫోన్ల కేంద్రంగా డాబాగార్డెన్స్ పేరు తెచ్చుకుంది. విశాఖలో తొలిసారిగా సెల్ పాయింట్ షోరూంను డైమండ్ పార్క్ వద్ద మోహన్‌ప్రసాద్ ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ విశాఖలో 29, రాష్ట్ర వ్యాప్తంగా 82 సెల్‌పాయింట్ స్టోర్లను విస్తరించారు.

విశాఖలో శ్రీలెదర్స్..

భారతీయ ఫుట్‌వేర్ పరిశ్రమల్లో 70 ఏళ్లుగా ప్రఖ్యాతిగాంచిన శ్రీలెదర్స్ ఆంధ్రప్రదేశ్‌లో విశాఖలో తొలిసారిగా రిటైల్ అవుట్‌లెట్స్ ప్రారంభించింది. 1952లో స్వాతంత్ర్య సమరయోధుడు సురేష్ చంద్రదే శ్రీలెదర్స్‌ను తొలిసారిగా జార్ఖండ్‌లో ప్రారంభించారు. విశాఖలో గత డిసెంబర్‌లో సింగ్ హోటల్ జంక్షన్ వద్ద శ్రీలెదర్స్‌ను ప్రారంభించారు.

శ్రీరామానుజ కాలేజ్‌లో ఉత్తమ విద్యాబోధన

ఆరిలోవ : నగరంలోని విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధి పెదవాల్తేరు ప్రాంతం డాక్టర్స్ కాలనీలో ఉన్న శ్రీ రామానుజ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తున్నారు. ఈ కళాశాల విద్యా రంగంలో నగరంలో ప్రథమ శ్రేణి సంస్థగా నిలుస్తోంది. విద్యార్థుల భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దడంలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తోంది. అవసరమైన సౌకర్యాలు కల్పించి తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపకుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ కళాశాల అమెరికాలోని కెంటకీలో నిర్వహిస్తున్న బ్లూగ్రాస్ కమ్యూనిటీ అండ్ టెక్నికల్ కాలేజ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అప్పటి నుంచి విద్యార్థులు అమెరికా వెళ్లి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను తక్కువ ఖర్చుతో అభ్యసించడానికి అవకాశం కలుగుతోంది. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా, పోటీ పరీక్షలకు సమర్థంగా సిద్ధం చేసేలా బోధిస్తున్నారు. విద్యార్థులు కూడా ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో పట్టుదలతో చదువుకుని అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది కళాశాలలో 18 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరుకాగా 11 మంది అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. 110 మంది ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయగా 13 మంది ఉత్తమ ర్యాంకులు సాధించి దేశంలోని ప్రముఖ సంస్థల్లో ప్రవేశాలు పొందారు. దీంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల ఉత్తమ బోధన వల్లే ఇది సాధ్యమవుతోందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నామని, కఠినమైన అంశాలను సులభతరం చేస్తున్నామని అధ్యాపకులు అంటున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, విద్యార్థుల పట్టుదల వల్లే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ శివ రామ దత్తాత్రేయ తెలిపారు.



శ్రీరామానుజ జూనియర్ కాలేజ్

జీవనశైలి మార్పుల వల్లే క్యాన్సర్

మహారాణిపేట : జీవన శైలిలో వచ్చిన మార్పులు వల్లే క్యాన్సర్ విజృంభిస్తోంది. కాలుష్య ప్రభావం, అలవాట్లు, వ్యసనాలు, జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యం వల్ల రోజురోజుకూ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రకృతి పరంగా దొరికే ఆహారం లేకపోవడం, అర్బన్‌లో ఎక్కువగా జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతుండడంతో పురుషులు, స్త్రీలు అన్న తేడా లేకుండా అందరూ క్యాన్సర్‌కు గురవుతున్నారు. స్త్రీలలో ఎక్కువగా రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు పురుషులు కన్నా ఎక్కువగా ఉన్నారు. తగినంత వ్యాయమం లేకపోవడం, పొగాకు వినియోగం, ఖైనీ, ఆల్కహాల్ వినియోగం వల్ల లక్షలాది మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. వ్యాయమం చేయడం, ఉబకాయాన్ని నివారించడం, జీవన శైలి మార్పులు ద్వారా క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చు. భారత ప్రభుత్వ పథకం ఆయుష్మాన్ భారత్, రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకంతో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారందరికీ క్యాన్సర్ సంరక్షణను అందిస్తున్నారు. లంగ్ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భసంచి ముఖ ద్వార క్యాన్సర్‌ను నయం చేయవచ్చు. తొలి దశలో గుర్తిస్తే ఎలాంటి క్యాన్సర్ అయినా నివారించవచ్చు. క్యాన్సర్ సోకిందని భయపడాల్సిన అవసరం లేదు. సకాలంలో గుర్తించి మందులు వాడి ఎంతో మంది క్యాన్సర్‌ను జయించారు.

– డాక్టర్ బెల్లాల రవిశంకర్, మేనేజింగ్ డైరెక్టర్, ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి



పక్షులను, పర్యావరణాన్ని కాపాడుదాం

పక్షులను కాపాడి పర్యావరణ సమతుల్యానికి బాటలు వేద్దాం. ఈ మేరకు సత్వా నేచురల్స్ స్టోర్‌కు వచ్చే వినియోగదారులకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకొస్తున్నాం. సెల్‌ఫోన్ టవర్స్ రేడియేషన్ వల్ల పక్షుల మనుగడకు ముప్పు ఏర్పడింది. అలాగే క్రిమి సంహారక మందులతో పంటలు పండించడంతో ఆ ఆహార గింజలు తిని చిన్నచిన్న కీటకాలు, పక్షులు మృత్యువాత పడుతున్నాయి. నగరీకరణలో భాగంగా చెట్లు నరికి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడంతో పక్షుల గూళ్లు కట్టుకునే నివాస పరిస్థితులు తగ్గిపోయాయి. పక్షులు తమ జీవనాన్ని కొనసాగించే వాతావరణాన్ని కల్పించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. పక్షులకు ఆహారం, నీరు అందించి, ఇంటి ఆవరణలో వరి కంకులు, గూళ్లు అమర్చి పక్షులకు నివాసాన్ని కల్పించాలి. అంతరించిపోతున్న పిచ్చుకలు, పావురాలు, రామ చిలుకలు ఇతర పక్షులను కాపాడుకునేలా సత్వా నేచురల్స్ కృషి చేస్తోంది. రైతుల నుంచి వరి కంకులు సేకరించి అదే ధరకు తమ స్టోర్‌కు వచ్చే కస్టమర్లకు అందించి ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నాం.

– వి.లక్ష్మీ తేజ, సత్వా నేచురల్స్, సీతమ్మధార.





జేఎస్ఆర్ సిల్క్స్‌లో ఆఫర్లకు విశేష ఆదరణ

సీతంపేట : జగదాంబ థియేటర్ కాంప్లెక్స్‌లో గల జేఎస్ఆర్ షాపింగ్‌మాల్‌లో ఆఫర్లకు విశేష ఆదరణ లభిస్తోంది. సంక్రాంతి పండగ సందర్భంగా అన్ని వస్త్రాలపై 50 శాతం వరకు డిస్కౌంట్ లభిస్తోంది. మెగా సేల్‌లో భాగంగా ఆధునిక, సంప్రదాయ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. ఫ్యాన్సీ, డిజైనర్, సిల్క్, బెనారస్ చీరలు, చుడీదార్స్, డ్రెస్ మెటీరియల్, కుర్తీస్, లెహంగాస్, గాగ్రాస్, కిడ్స్, వెస్ట్రన్ వేర్ దుస్తులు షోరూంలో ఆకట్టుకుంటున్నాయి. కుర్తీస్ రూ.99ల నుంచి మొదలు కానుండగా, చీరలు రూ.149 నుంచి ధరల్లో లభిస్తున్నాయి. వెస్ట్రన్ వేర్ రూ.249, 4 దుప్పటాస్ రూ. 299, 4 సిల్క్ శారీస్ రూ.599, 4 కాటన్ శారీస్ రూ. 599ల నుంచి లభిస్తాయని షోరూం ప్రొప్రైటర్ వేగి జగదీష్‌కుమార్ తెలిపారు.



ప్రెస్టీజ్ సంక్రాంతి బొనంజా



దక్షిణలోని రాంనగర్‌లో గల ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూజివ్ షోరూం సంక్రాంతి బొనంజా ప్రకటించింది. గత 20 ఏళ్లుగా కస్టమర్ల ఆదరాభిమానాలు పొందుతున్న షోరూంలో అతి తక్కువ కాంబో ఆఫర్లను కస్టమర్ దేవుళ్లకు అందిస్తోంది. స్టెయిన్‌లెస్ స్టీల్ 24 పీసెస్ డిన్నర్ సెట్, 3 పీసెస్ నాన్‌స్టిక్ కుక్‌వేర్, 3 పీసెస్ ప్లాటినం కుక్‌వేర్‌ను అతి తక్కువ ధరలకే విక్రయిస్తోందని ప్రెస్టీజ్ రాంనగర్ ఎక్స్‌క్లూజివ్ షోరూం ప్రతినిధులు తెలిపారు.